క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేసుకున్న వారితో వైద్యులు, రోటరీ క్లబ్ నిర్వాహకులు

నగరి: పట్టణంలోని పీసీఎన్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ప్రతినిధులు కోరా సంస్థ దాతృత్వంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులు నేత్ర సంబంధిత వ్యాధులకు, తిరుపతి రుయా హాస్పిటల్, ప్రభుత్వ ప్రసూతి వైద్యులతో గర్భకోశ సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రుయా ఆస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, కార్డియాలజిస్ట్ వెంకటరమణ, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సాయి భావన తదితరులు పాల్గొన్నారు.

ఓం శక్తి ఆలయంలో పూజలు

నిండ్ర: మండల కేంద్రంలోని ఓం శక్తి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమిళనాడు మేల్‌మరవత్తూరు ఓంశక్తి ఆలయ ధర్మకర్త బంగారు అడిగళార్ వారం రోజుల క్రితం స్వర్గస్తులయ్యారు. ఆదివారం కర్మక్రియల జరిగిన నేపథ్యంలో నిండ్ర ఆలయంలో పూజలు చేసి అన్నదానం చేశారు.

వృద్ధులకు చీరల పంపిణీ



వృద్ధులకు చీరలు వితరణ చేస్తున్న క్రిష్టయ్య

కార్వేటినగరం: పేదలకు సేవా కార్యక్రమాలు చేపట్టడమే సత్యా ఫౌండేషన్ లక్ష్యమని ఆ సంస్థ డైరెక్టర్ కె.క్రిష్టయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పాదిరికుప్పం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పాదిరికుప్పం, గోపిశెట్టిపల్లి గ్రామాలకు చెందిన వృద్ధులు, దివ్యాంగులు పేదలు 50 మందికి చీరలు, పంచెలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ డైరెక్టర్ మాట్లాడుతూ..అనాథ శరణాలయాల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వృద్ధాశ్రమాలకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షురాలు సత్యవేణి, పాస్టర్ చార్లెస్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

జనావాసంలోకి కొండ చిలువ



గ్రామంలోకి వచ్చిన కొండ చిలువ

వెదురుకుప్పం: మండలంలోని బలిజమొండి వెంగనపల్లె గ్రామంలో ఆదివారం ఉదయం కొండ చిలువ సంచరించింది. ఓ ఇంటి వద్ద కోడిని తింటుండగా స్థానికులు గుర్తించి భయాందోళనకు గురయ్యారు. భయపడిన గ్రామస్తులు కొండ చిలువను చంపేశారు. తరచూ గ్రామంలోకి కొండ చిలువలు, వన్యమృగాలు సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయకంపితులవుతున్నారు.

సాంస్కృతిక జీవనానికి ప్రతీక సభా కథలు



మా కథలు-2022 పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: చిత్తూరు జిల్లా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రచయిత కె.సభా కథలు రచనా వ్యాసంగం చేశారని ప్రముఖ రచయిత మధురాంతకం నరేంద్ర అన్నారు. ఆదివారం సాయంత్రం బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కె.సభా సంస్మరణ సభ, మా కథలు-2022 కథ సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మధురాంతకం నరేంద్ర, భూమన్ పాల్గొన్నారు. ఆత్మీయ అతిథులుగా పలమనేరు బాలాజీ, కృష్ణస్వామి రాజు పాల్గొన్నారు. సాకం నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆకుల మల్లేశ్వరరావు, డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, తమటం రామచంద్రారెడ్డి, కలువగుంట రామమూర్తి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, యువశ్రీ మురళి, పల్లిపట్టు నాగరాజు, కాంతారావు, సురేంద్ర రొడ్డా పాల్గొన్నారు.

నేడు ఖాదీ ఫెస్ట్ ప్రారంభం

తిరుపతి కల్చరల్: దేశవ్యాప్తంగా ఖాదీ ఉత్పత్తులను పెంచాలనే లక్ష్యంతో ఖాదీ వారోత్సవాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాలని కేంద్రం ఇచ్చిన ఆదేశాల మేరకు సోమవారం తిరుపతిలోని పాత వెంకటేశ్వర థియేటర్ వద్ద నున్న ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఖాదీ ఫెస్ట్ ప్రారంభిస్తున్నట్లు ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ సీఈవో వీఆర్ విజయరాఘవ నాయక్ తెలిపారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేతుల మీదగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ నెల 30 నుంచి నవంబర్ 8వ తేదీ వరకు ఈ ఖాదీ ఫెస్ట్ నిర్వహిస్తామని తెలిపారు. ఖాదీ విలేజ్ కమిషన్ బోర్డు కమిషనర్ కోటిరెడ్డి, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు ఉమ్మడి చిత్తూరు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్రామ్, డెప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.



మంచు కురిసే వేళలో..





వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అకస్మాత్తుగా వర్షం, ఎండ, ఉక్కపోత అంటూ మిళితమైన వాతావరణంతో పాటు ఉదయాన్నే ఊటీని తలపించేలా మంచు కమ్ముకుంటోంది. నగరిలో ఎప్పుడూ లేని విధంగా ఆదివారం ఉదయం మంచు కురిసింది. చూపరులను కనువిందు చేసింది. మంచులో అటువైపున్న నివాసాలు, చెట్లు, వాహనాలు సైతం కనిపించని పరిస్థితి నెలకొంది. - నగరి

గేట్‌పుత్తూరులో వేగంగా అభివృద్ధి పనులు

- రూ.2 కోట్లతో పార్కు, రూ.34 లక్షలతో కమ్యూనిటీ హాలు
- రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తాం
- గడప గడపకు కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా



లబ్ధిదారులకు సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి రోజా

పుత్తూరు రూరల్: పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువ శాతం ఉన్న గేట్‌పుత్తూరులో చరిత్రలో నిలిచిపోయే విధంగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. ఆదివారం సాయంత్రం పుత్తూరు మున్సిపాలిటీ 8వ వార్డు దాసరిగుంట సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి నాలుగున్నరేళ్లగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన మ్యానిఫెస్టోలోని హామీలను జగనన్న 99 శాతం నెరవేర్చినట్లు చెప్పారు. అవ్వా పింఛన్ అందుతోందా? అక్కా చేయూత అందిందా? ఆరోగ్యశ్రీ పథకం ఆదుకుం? అమ్మ ఒడి చదువు అందిస్తోందా అంటూ ఆరా తీశారు. అందరూ అన్నీ అందుతున్నాయని సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతోనే పుత్తూరులో పలు అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయని తెలిపారు. గేట్ పుత్తూరులో తుడ నిధులు రూ.2 కోట్లతో పార్కు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఇటీవలే గోవిందమ్మ ఆలయం వద్ద రూ.34 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు గుర్తు చేశారు. గేట్ పుత్తూరు ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్న రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి విత్ ర్యాంప్‌ను సైతం త్వరలోనే ఏర్పాటు చేయనున్నటుల్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను జగనన్న సహకారంతో కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగిందని స్పష్టం చేశారు. వర్క్ ఆర్డర్ వచ్చిన వెంటనే పనులు ప్రారంభం అవుతుందన్నారు. గేట్‌పుత్తూరు ప్రజల కోసమే రూ.80 లక్షలతో అర్బన్ హెల్త్ సెంటర్ పనులు, రూ.1.10 లక్షలతో విద్యుత్ శ్మశాన వాటిక చివరి దశ పనులు జరుగుతున్నాయని, త్వరలోనే వీటిని ప్రారంభించనున్నట్లు చెప్పారు. పేద విద్యార్థుల చదువుల కోసం రూ.7.65 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాలను సైతం ఇదివరకే ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలా మన ముఖ్యమంత్రి అడిగిన ప్రతి పనిని మనకు మంజూరు చేస్తున్నారని చెప్పారు. ప్రత్యేకించి మహిళల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. మనసున్న ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. ఇందుకు ప్రతి మహిళా సహకరించాలని కోరారు. నగరి ఎమ్మెల్యేగా తనను ముచ్చటగా మూడోసారి గెలిపించాలని కోరారు. అంతకు ముందు స్థానిక సెంగుంధర్ మక్కల్ నల సంఘం అధ్యక్షుడు జయచంద్రన్ ఆధ్వర్యంలో మంత్రికి ఘన స్వాగతం పలికి, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలీప్‌మొదలి, సదాశివ కోన, ద్రౌపదీదేవి, ఆరేటమ్మ, ఆలయాల చైర్మన్లు జయచంద్రన్, లారీమోహన్, మనోహర్‌రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, కౌన్సిలర్లు ఏకాంబరం, గుణ, షకీలా, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరునావక్కరసు, గోపి, సుందరం, శివశంకర్, జయరామిరెడ్డి, మునిరత్నం, జయబాబు, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలకు చేయూత

గతంలో ఎన్నడూ లేని విధంగా జగనన్న ప్రభుత్వం నాలుగున్నరేళ్ల పాలనలో నేతన్నల కోసం వివిధ పథకాల ద్వారా రూ.3,706.06 కోట్లు వ్యయం చేసినట్లు పర్యాటకశాఖ మంతి ఆర్కే రోజా తెలిపారు. నేతన్నలకు పెన్షన్ ద్వారా రూ.1,396.45 కోట్లు, నేతన్న నేస్తం ద్వారా రూ.969.77 కోట్లు, గత ప్రభుత్వ బకాయిలతో కలిపి ఆప్కోకు రూ.468.84 కోట్లు, ఇతర పథకాల ద్వారా రూ.871 కోట్లు వ్యయం చేసినట్లు వివరించారు.

వినియోగదారుల సౌకర్యం కోసమే టవర్ల ఏర్పాటు

- బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ అమరేందర్‌రెడ్డి



తూగుండ్రంలో అధికారులతో మాట్లాడుతున్న జీఎం

గంగాధర నెల్లూరు: వినియోగదారుల సౌకర్యం కోసమే మారుమూల ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ కొత్త టవర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ జనరల్ మేనేజర్ అమరేందర్ రెడ్డి తెలిపారు. మండలంలోని పాచిగుంట వద్ద కొత్తగా ఏర్పాటు చేస్తున్న టవర్ పనులను ఆదివారం పరిశీలించారు. అనంతరం తూగుండ్రం గ్రామం సమీపంలో టవర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవ, స్థానికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా టవర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. అదే విధంగా ఫైబర్ నెట్ కనెక్షన్ ద్వారా రూ.399, రూ.499, రూ.599 కనెక్షన్‌లు పొందితే ఇంటర్నెట్, కాల్ సౌకర్యం లభిస్తుందని తెలిపారు. డివిజినల్ ఇంజినీర్ సురేంద్రనాథ్, సబ్ ఇంజినీర్ శ్రీనివాసులు, జేటీఓ సిద్ధయ్య, జేఈ నర్సింహా రెడ్డి, జీవారత్నం పాల్గొన్నారు.

దళితులంటే ఆ పార్టీలకు చిన్నచూపు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

శ్రీరంగరాజపురం: టీడీపీ, జనసేన పార్టీలకు దళితులంటే చిన్నచూపని.. వారి ఓట్లు కావాలి కానీ వారి అభ్యున్నతి అవసరం లేదా అని

వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మణి ప్రశ్నించారు. శ్రీరంగరాజపురంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన పార్టీలు దళిత వ్యతిరేక పార్టీలన్నారు. గతంలో కారంచేడులో దళితులను కాల్చిచంపింది చంద్రబాబే అని, ఎవరైనా దళితులుగా పుట్టాలనుకుంటారా అన్న చంద్రబాబు నేడు దళితుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని నారా లోకేష్, పవన్‌కళ్యాణ్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ దళితులకు పెద్దపీట వేసిందన్నారు. డిప్యూటీ సీఎంతో పాటు కార్పొరేషన్ చైర్మన్లు, నామినేటెడ్ పదవుల్లో ఎక్కువ మంది దళితులకు అవకాశం ఇచ్చారన్నారు. సీఎం జగనన్న సహకారంతో డిప్యూటీ సీఎం నారాయణస్వామి జీడీనెల్లూరు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కలప్పా, నాయకులు బాబు, మహేష్, మణి, అమృతరాజ్, ఏకాంబరం ఉన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



నృత్యాలతో ప్రేక్షకులను అలరిస్తున్న కళాకారులు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన భరతనాట్య ప్రదర్శన అలరించింది. తిరుపతికి చెందిన పుష్ప బృందం ఆధ్వర్యంలో కళాకారులు చిన్నారులు భరతనాట్యం ప్రదర్శించారు. ఇందులో భాగంగా పుష్పాంజలి, అయిగిరి నందిని, ముద్దుగారే యశోద, మల్లారి కీర్తన, ఒకపరి ఒకపరి వయ్యారి, కోయిలారే మామ కోయిలారే, జయకృష్ణ ముకుందా, శంభో స్వయంభో హర హర వంటి పాటలకు కళాకారులు రిత్విక, సహస్ర, లాస్య, ప్రత్యూష, ప్రియ, నీతిక, అనన్య, విహాన్యల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాటకు తగ్గ అభినయం, హావభావాలతో కళాకారులు చూడచక్కని నత్యాలను ప్రదర్శించడంతో ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారికి అభినందనలు తెలిపారు. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్ వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నిక





విజయ్ కుమార్‌రెడ్డి, రమేష్

గంగాధర నెల్లూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార ఎంప్లాయీస్ సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా గంగాధర నెల్లూరు మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ వీఎస్.విజయ్ కుమార్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో ఆయన ఎన్నిక జరిగింది. అలాగే వెదురుకుప్పం మండలం చవటగుంట వ్యవసాయ సహకార సంఘం సీఈఓ రమేష్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సర్వీస్ రూల్స్ రూపొందించండి



వినతి పత్రం సమర్పిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉద్యోగ సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: ప్రభుత్వంలో విలీనమై రెండేళ్ల గడిచినా ఇంత వరకు తమకు సర్వీస్ నిబంధనలు రూపొందించలేదని, సర్వీస్ రూల్స్‌ను రూపొందించి ఆదుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉద్యోగ సంఘం నేతలు ఆదివారం ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కల్పలతారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు ఎస్వీ యూనివర్సిటీలో వారిని కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, డాక్టర్ జలగం రామాంజులు, ఉద్యోగ సంఘ నేతలు సురేంద్ర, సావిత్రీబాయి, శ్రీనివాసులు, డాక్టర్ సుప్రజారాణి, సంజీవరావు, భరణికుమార్, సోమనాథ్, ప్రతాప్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి



శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలు (50) మృతి చెందింది. ఒకటో పట్టణ సీఐ అంజుయాదవ్ కథనం మేరకు.. ఆదివారం మిట్టకండ్రిగ వద్ద ఓ వృద్ధురాలు జాతీయ రహదారి దాటే క్రమంలో శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ అంజుయాదవ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి వివరాలు తెలియకపోవడంతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువులకు వైద్య పరీక్షలు



రైతులకు సబ్సిడీపై మినరల్ మిక్చర్ అందజేస్తున్న ఏసీఓ

పాలసముద్రం: పోషక విలువలు కలిగిన పదార్థాలతోనే అధిక పాల దిగుబడి సాధ్యమని పశువైద్యాధికారి భానుప్రసాద్ తెలిపారు. ఆదివారం వెంగళరాజుకుప్పం పంచాయతీ వీర్లగుడి గ్రామంలో శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ ఏసీఓ ఈ.మహేశ్వరెడ్డి ఆధ్వర్యంలో పాడి పశువులకు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు వైద్య పరీక్షలు చేశారు. అధిక పాల దిగుబడిపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. పశువుల పెంపకం, ఆరోగ్య రక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పోషక విలువలు కలిగిన మినరల్ మిక్చర్ వాడడం వల్ల పశువులు త్వరగా ఎదకు వస్తాయని చెప్పారు. హార్మోన్ సమతుల్యత లోపం లేకుండా ఉంటుందని తెలిపారు. పశువులను పిడుదు, ఈగల సమస్యల రాకుండా రెండు రోజులకు ఒకసారి శుభ్రంగా కడగాలని సూచించారు. 10 పశువులకు కృత్రిమ గర్భాధారణ, 50 పశువులకు వైద్య పరీక్షలు చేసి పిడుదు మందులు పిచికారీ చేశారు.

ఆర్టీసీ కార్మికుల ఆందోళన



పుత్తూరు ఆర్టీసీ డిపో ఎదుట కార్మికుల నిరసన

పుత్తూరు రూరల్: నెల్లూరు జిల్లా కావలి వద్ద ఆర్టీసీ బస్సు డ్రైవర్ రామ్‌సింగ్‌పై దాడిని నిరసిస్తూ పుత్తూరు ఆర్టీసీ డిపో వద్ద వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన వారిలో కొంత మందినే అరెస్ట్ చేశారని, మిగిలిన వారిని సైతం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



వైస్ ఎంపీపీ దూది అరుణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



నివాళులర్పిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

కార్వేటినగరం: జీడీనెల్లూరు నియోజకవర్గంలో మృతి చెందిన వారి కుటుంబాలను ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ఆదివారం పరామర్శించారు. పెనుమూరు మండలం రాజా ఇండ్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ వైస్ ఎంపీపీ-2 దూది అరుణ శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమె మృతదేహానికి నారాయణస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అలాగే కొల్లాగుంట గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి రామ్‌ఖీ(35) మృతి చెందడంతో ఆ గ్రామానికి వెళ్లి రామ్‌ఖీ మృతదేహానికి పుష్పాంజలి ఘటించారు. ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. అదే విధంగా మంత్రి స్వగ్రామం పాదిరికుప్పం గ్రామానికి చెందిన బాలమ్మ(68)కు నివాళులర్పించారు. మంత్రి వెంట దూది మోహన్, యశోదారెడ్డి, పట్నం ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ దివ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

దూది అరుణ మృతి పార్టీకి తీరని లోటు

వైస్ ఎంపీపీ దూది అరుణ మృతి పార్టీకి తీరని లోటని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. దూది అరుణ మృతిపై సమాచారం అందుకున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు రాజా ఇండ్లకు చేరుకుని ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. ఆమె కుటుంబాన్ని ఓదార్చారు.

ఆలయాల్లో గ్రహణశాంతి పూజలు





బుగ్గ కాశీవిశ్వేశ్వరాలయంలో గోపూజ, దేశమ్మ ఆలయంలో పూజలు

నగరి: చంద్రగ్రహణం అనంతరం ఆదివారం వేకువజామున ఆలయాల్లో గ్రహణ శాంతి పూజలు నిర్వహించారు. ఆలయాలను శుద్ధి చేశారు. ఆలయ సంప్రోక్షణ అనంతరం దేవతా మూర్తులకు స్నపనాభిషేకాలు నిర్వహించారు. గోపూజ చేశారు. అర్చనలు, మహానివేదన, హారతి అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు.

ప్రవచనం కాదు.. ప్రజావచనం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం



వేమన పద్యభావనకు నృత్య ప్రదర్శన చేస్తున్న తిరుపతి బాలభవన్ విద్యార్థులు

తిరుపతి కల్చరల్: ప్రవచనాలు చెప్పే వారు చాలా మంది ఉన్నారు... అయితే నేటి సమాజానికి ప్రజావచనం చెప్పేవారు కావాలని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. యశోదనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వేమన విజ్ఞాన కేంద్ర భవనాన్ని ఆదివారం ప్రముఖ పాత్రికేయుడు, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి ప్రారంభించారు. చిత్తూరు జిల్లా కమ్యూనిస్టు నేత పలవలి రామకృష్ణారెడ్డి పేరిట ఏర్పాటు చసిన సభా మందిరాన్ని ఆయన కుమార్తె , మాజీ వీసీ ఆచార్య కుసుమకుమారి, ప్రముఖ అనువాదకుడు ఏజీ యతిరాజులు పేరిట నిర్మించిన సభా మందిరాన్ని ఆయన సతీమణి ఏజీ చంద్రమ్మ ప్రారంభించారు. దీనికి ముందు టీటీడీ పరిపాలనా భవనం నుంచి పెద్ద ఎత్తున వందలాది మంది విద్యార్థులు, సాహితీవేత్తలతో వేమన విజ్ఞాన కేంద్ర కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథి తెలకపల్లి రవి మాట్లాడుతూ సమాజానికి హేతుబద్ధ ప్రశ్నను నేరిృంచిన కవి వేమన అని కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ కళలకు, కళాసాహిత్యానికి కేంద్రంగా ఈ సంస్థ పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. వేమన తిరుపతి బాలభవన్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకం అలరింపజేసింది. మాజీ వీసీ కుసుమకుమారి, ఏజీ అరవింద్, సీనియర్ నటుడు కాకరాల, రాయలసీమ సాహితీవేత్త భూమన్, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ లింగుట్ల రమేష్‌నాథ్, తిరుపతి బాలోత్సవం గౌరవాధ్యక్షుడు టెంకాల దామోదరం, తిరుపతి జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు కేవీ చౌదరి, రచయిత్రి కొలకలూరి మధుజ్యోతి, కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత పల్లిపట్టు నాగరాజు, విజ్ఞాన కేంద్రాల కో ఆర్డినేటర్ పిన్నమనేని మురళీకృష్ణ, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున పాల్గొన్నారు.